క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ యశస్విరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు సునీల్ తెలిపారు. ఆదివారం జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి, సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్ యూత్ హాస్టల్‌లో ప్రాజెక్ట్ ఔషధ సమర్పణలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్విరెడ్డి మాట్లాడుతూ రక్తదానంపై ఉన్న అపోహల్ని పోగొట్టుకొని రక్తదానం చేయడానికి యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, సంస్థ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోను అలి, శ్రీను, శేకర్, ఇండియన్ రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం



మాట్లాడుతున్న ఎస్ఐ సంజీవరాయుడు

కడప రూరల్ : మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరమని టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు అన్నారు. ఆదివారం స్థానిక గౌస్‌నగర్‌లో జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఖాదర్‌బాష, షేక్ అమానుల్లా ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు బానిస కావద్దు-యువత నీ భవిష్యత్తు పాడు చేసుకోవద్దు అనే నినాదంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ సంజీవరాయుడు మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు కలిగిన యువత మత్తు పదార్థాలకు బానిస కావడం తగదన్నారు. తమ బంగారు భవిష్యత్తు కోసం యువత చైతన్యవంతులు కావాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారు రౌడీలు, గుండాలుగా మారుతున్నారన్నారు. మత్తు పదార్థాల వల్ల జీవితం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బుల్లెట్ నూర్, షఫీవుల్లా, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

తైవాన్ టెక్లో పరిశోధనకు ఆహ్వానం



సుబ్రమణ్యం శర్మ

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన సహా ఆచార్యులు డాక్టర్ ఎల్.సుబ్రమణ్యంశర్మను తైవాన్‌దేశంలో నెల రోజుల పాటు పరిశోధనలు చేసేందుకు ఆహ్వానం అందింది. ఈయన జులై 1వ తేదీ నుంచి తైవాన్ దేశంలోని ప్రతిష్టాత్మకమైన తైవాన్‌టెక్ తైపేలో ఉంటూ విద్యుత్ రసాయన శక్తిని ఉపయోగించి విద్యుత్ శక్తి తయారు చేయడంలో వినియోగించే ఫ్యూయల్ సెల్‌పై పరిశోధన చేస్తారు. తైవాన్ టెక్, కెమికల్ ఇంజనీరింగ్ ఆచార్యులు బింగ్-జ- హ్యాంగ్ ఆధ్వర్యంలో పరిశోధనలు చేయనున్నారు. డాక్టర్ సుబ్రమణ్యంశర్మ తైవాన్‌కు వెళుతున్న సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

కాలనీలో సౌకర్యాలు కల్పించాలి



పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో పర్యటిస్తున్న ఆర్‌సీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివారులోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో కనీస సౌకర్యాలను కల్పించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో ఆయన ఆర్‌సీపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతం ఏర్పాటై దాదాపు 25 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు స్తంభాలు సరిగా లేక ప్రజలు నానావస్థలు పడుతున్నారన్నారు. కొన్ని వీధులకు మాత్రమే సిమెంట్ రోడ్లు ఉండి మిగతా వీధులకు సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు ప్రజలు నడవడానికి అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు ప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనాలి

కడప రూరల్ : పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొనాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు హరిప్రసాద్, క్రీసెంట్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.







గిజిగాడి గూడు.. నైపుణ్యం చూడు



అద్భుత నైపుణ్యంతో 'గిజిగాడి పక్షి' నిర్మించిన 'వేలాడే గూళ్లు' చూపరులను అబ్బురపరుస్తున్నాయి. భాకరాపేట, సిద్దవటం మధ్య పొలాల్లో తాటి చెట్టుకు ఏర్పాటు చేసుకున్న ఆ గూళ్లు ఆ దారి వెంట వెళ్తున్న వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. గిజిగాడు అంటే పిచ్చుక(పిట్ట). మగపక్షి మాత్రమే చక్కని ఇంజినీరింగ్ ప్రతిభతో అందంగా గూడును అల్లి ఆడ గిజిగాడిని ఆకర్షిస్తుంది. ఆడ పక్షికి ఆ గూడు నచ్చితే అందులో ఆవాసం ఏర్పరుచుకుని, మగపక్షితో సహవాసం చేస్తూ జీవనం గడుపుతుంది.

ఎంతో నేర్పరితనం

గిజిగాడు కట్టే గూడు ఎంతో నేర్పరితనం కలిగి ఉంటుంది. గూళ్లు అల్లడం, పిల్లలకు ఆహారం నోటికి అందించడం, శత్రువులను ఎదుర్కోవడం.. పాములు తదితరాల బారి నుంచి గుడ్లు, పిల్లలను కాపాడుకోవడానికి గూళ్లను ముళ్ల చెట్ల పైన, నీటికి దగ్గరగా కిందికి వేలాడే రీతిలో కట్టుకోవడం వీటి అద్భుతమైన తెలివికి నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

కడప కార్పొరేషన్ : ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో ఆదివారం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కంటా మురళీక్రిష్ణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ మాట్లాడుతూ సబ్ ఇంజినీర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన మురళీక్రిష్ణ విధి నిర్వహణలో నీతి నిజాయితీతో పని చేశారని, కిందిస్థాయి సిబ్బందిని ప్రోత్సహించి వారి ఉన్నతికి పాటుపడ్డారన్నారు. తోటి ఉద్యోగులతో స్నేహ పూర్వక సంబంధాలు నెరపడంతోపాటు కింది స్థాయి సిబ్బందితో కూడా కలిసి పోయి పని చేసే వారన్నారు. ఎక్కడ పనిచేసినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును పొందారని తెలిపారు. అనంతరం మురళీక్రిష్ణ దంపతులను ఎస్ఈ రమణ ఘనంగా సన్మానించారు. తోటి ఉద్యోగులు, సిబ్బంది, బంధుమిత్రులు గజమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఈల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కేవీ శేషారెడ్డి, రిటైర్డ్ ఎస్ఈ వై.ప్రతాప్‌రెడ్డి, ఈఈ ఎల్.నరసింహప్రసాద్, జనరల్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డి, డీఈలు నాగమునిస్వామి, చాంద్‌బాషా, చెన్నూరు ఏఈ రామలింగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



కడప కార్పొరేషన్ : ఏఈ మురళీక్రిష్ణతో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ, ఉద్యోగులు



కడప ఎడ్యుకేషన్ : చెన్నయ్యను సన్మానిస్తున్న ఏపీ రాష్ట్ర రాయల అంధుల సంఘం నాయకులు

అంధుల ఉద్యోగులకు ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్ : కడప కొండాయపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ పొందిన పీసీ చెన్నయ్య, కడప అగ్రికల్చర్ సాయిల్ సర్వే కార్యాలయంలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన మల్లిశెట్టి గంగమ్మ అనే అంధ ఉద్యోగులను ఏపీ రాష్ట్ర రాయల అంధుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కడప నగరం శంకరాపురంలోని అంధుల ఉన్నత పాఠశాలలో అంధ ఉద్యోగులైన పీసీ చెన్నయ్య, మల్లిశెట్టి గంగమ్మలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాయల అంధుల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంధుల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎబినైజర్ మాట్లాడుతూ చెన్నయ్య ఉపాధ్యాయుడిగా పని చేసి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారని కొనియాడారు. అలాగే మల్లిశెట్టి గంగమ్మ అగ్రికల్చర్ సాయిల్ సర్వేలో పని చేసి రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర రాయల అంధుల సంఘం ఉపాధ్యక్షులు చౌడమ్మ, హజరత్తయ్య, ట్రెజరర్ రాజా, ఎక్స్ అఫిషియో నాగభూషణాచారి, గౌరవ సలహాదారు తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నది.. రాష్ట్రంలో అతి పెద్దది

కడప కల్చరల్ : పెన్నానది మూడు జిల్లాలు, మూడు వందలకుపైగా గ్రామాల ద్వారా ప్రవహిస్తోందని గ్రౌండ్ వాటర్, వాటర్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత సంచాలకులు ఎ.వరప్రసాదరావు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 'నెలనెల సీమ సాహిత్యం' కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన రాయలసీమ నదీ సాహిత్యం(రెండవ భాగం) అంశంపై మాట్లాడారు. మన రాష్ట్రంలో పెన్నానది అతి పెద్దదని, కృష్ణ, గోదావరి నదుల కన్నా విస్తారమైందన్నారు. పెన్నానది పుట్టుక గురించి, దానికిగల ఇతర పేర్ల గురించి వివరించారు. రాయలసీమకు జీవనాధారమైన ఈ నది అనంతపురం, వైఎస్సార్, నెల్లూరు జిల్లాలో 344 గ్రామాల ద్వారా ప్రవహిస్తుందన్నారు. దానికి చిత్రావతి, పాపాగ్ని, చెయ్యేరు, సగిలేరు, మాండవ్య తదితర ఉపనదులు ఉన్నాయని తెలిపారు. నది, కాలువ, వాగు, వంక అనే వాటిని నిర్వచించి ఉదాహరణలతో తెలియజేశారు. నీటి ప్రాధాన్యతను వివరిస్తూ భూమిపైన ఎక్కువ భాగం నీరు ఉండడంతో ఇతర గ్రహాల కంటే భూమికి అధిక ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. బ్రౌన్ పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ కలిసి వరప్రసాద్‌రావును సత్కరించారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్, సుమతి, రాణి, శీను, లింగమయ్య, చెన్నకేశవరెడ్డి, గానుగపెంట హనుమంతరావు, కొత్తపల్లి రామాంజనేయులు, మాచిరాజు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



వరప్రసాద్‌రావును సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

తెలుగు నాటకాల్లో 'హరిశ్చంద్ర'కు ప్రత్యేక స్థానం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : తెలుగులో వందలాది రంగస్థల నాటకాలు వచ్చినా బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి రచించిన సత్యహరిశ్చంద్రకు ప్రత్యేక స్థానం ఉందని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో బలిజేపల్లి 71వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తెలుగులో వచ్చిన వందలాది నాటకాలలో సత్యహరిశ్చంద్ర సత్యం విలువ, ధర్మాచరణ విలువ గురించి చాటి చెప్పిందన్నారు. గాంధీజీ సైతం ఆ నాటకం ద్వారా సత్యం పట్ల మొగ్గు చూపారంటే ఆ నాటకం ప్రభావం నాటి సమాజంపై ఎంత ఉండిందో తెలుస్తోందన్నారు. ఆ నాటకంలోని పద్యాలు నేటికీ గ్రామగ్రామాన వినిపిస్తున్నాయని తెలిపారు. తెలుగు విశ్రాంత అధ్యాపకులు జీవకళ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నాటకం రచించి వంద ఏళ్లయినా నేటికీ దాదాపు ప్రతిరోజు తెలుగు నాట ఎక్కడో ప్రదర్శిస్తూనే ఉండడం, ఆ నాటకం ఘనతను చాటుతోందన్నారు. తొలుత బలిజేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హరిశ్చంద్ర నాటకంలో ప్రధాన పాత్రలు పోషించి ప్రేక్షక ఆదరణ పొందిన కళాకారులు తక్కోలు సుబ్బన్న, వలసిగాండ్ల సుధాకర్, భూమిరెడ్డి స్వరూపారాణి, కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, శూలం పోలయ్యలను ఘనంగా సత్కరించారు. తర్వాత ప్రసిద్ధ రంగస్థల కళాకారులు మందల మురళి, బ్యాంకు గంగయ్య, బాల ఓబయ్య, రామసుబ్బయ్య హరిశ్చంద్ర నాటకం లోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. కార్యక్రమంలో జ్యోతి జార్జి, సంటెన్న, చెన్నయ్య, హరి పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా రజత ఉత్సవాలు

కడప అర్బన్ : కడప నగరంలోని నబీకోటలో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో రజత ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రాతఃకాల మహోత్సవ పూజలు, హోమం, మధ్యాహ్నం అన్నప్రసాదం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తాదులు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



పల్లకీ సేవలో షిరిడీ సాయిబాబా ఉత్సవ విగ్రహం



కోలాటం ఆడుతున్న మహిళలు

శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమి విద్యార్థులు నృత్య గురువు విజయశాంతి ఆధ్వర్యంలో పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రత్యేకంగా వారు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామాల రాష్ట్ర పాలనాధికారి మునిరాజు పర్యవేక్షించారు.



వీధి కుక్కల స్వైర విహారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం విజయదుర్గ కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. వీధి కుక్కలు రాత్రి సమయంలో స్వైర విహారం చేస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు, మహిళలు పగటి పూట ఆ ప్రాంతంలో తిరగాలంటే భయపడిపోతున్నారు. అంతేకాకుండా అర్ధరాత్రి కుక్కల అరుపులతో కాలనీ ప్రజలకు నిద్ర లేకుండా పోతోంది. కార్పొరేషన్ అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.